క్లుప్తంగా

సీపీఐ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెల్లబోయిన రంగారావు

భీమవరం (ప్రకాశంచౌక్): భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) భీమవరం పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో సీపీఐ శత వసంతాల ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ డిసెంబర్ 26 నాటికి దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తయ్యాయని అన్నారు. శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మీపతి, వైవీ ఆనంద్, పాలా త్రిమూర్తులు, పి.యాకోబు పాల్గొన్నారు.

పేపర్ ప్రజెంటేషన్‌లో ఉపాధ్యాయుడు రేపాక ప్రతిభ



ఉత్తమ బహుమతి అందుకుంటున్న గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్నబాబు

భీమవరం అర్బన్: రాజమండ్రిలో నిర్వహించిన మ్యాథమేటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గణిత దినోత్సవంలో పాల్గొన్న అనాకోడేరులోని డీఎన్నార్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్నబాబు పేపర్ ప్రెజెంటేషన్‌తో ప్రతిభచూపి ఉత్తమ బహుమతి సాధించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీజ గణిత బోధన, అభ్యసనలో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కార మార్గాలు అనే అంశానికి సంబంధించి ఉత్తమ బహుమతి ముఖ్య అతిథి డిప్యూటీ డైరెక్టర్ ఎస్ అబ్రహం చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. రేపాక వెంకన్నబాబును ప్రధానోపాధ్యాయురాలు వీఎమ్ నిర్మలాకుమారి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పసుపు కొమ్ములతో పద్మావతి అమ్మవారికి అలంకరణ



పసుపు కొమ్ముల అలంకరణలో పద్మావతి అమ్మవారు

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసం సందర్భంగా జేపీ రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అమ్మవారికి 150 కేజీల పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శ్రీరామానుజచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం. 150 కిలోల పసుపు కొమ్ములతో పూజ చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

1న సినీ పాటల పోటీలు

పెనుగొండ: ఆదర్శ రైతు రంకిరెడ్డి వీరన్న, సత్యవతిల జ్ఞాపకార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలను మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు ఆదిఆవరం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలను ఇరగవరం మండలం అయితంపూడిలో జనవరి 1వ తేదీ 2 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కన్వీనరు చివటం సుబ్బారావు, సెల్ నంబర్ 9849528590కు ఫోన్ చేయాలని సూచించారు.

ఉల్లంపర్రులో ఆరోగ్య శిబిరం



మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న శ్యం

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ ఇంటర్నేషనల్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉల్లంపర్రులో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. పాలకొల్లు టౌన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి ఎముకల వైద్య నిపుణులు నారిన హర్ష, జనరల్ మెడిసిన్ డాక్టర్ కార్తీక్ పాల్గొని సుమారు 200 మంది రోగులను పరీక్షించి ఆరోగ్య సలహాలు అందించారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామమోహన్‌రావు, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, శిరిగినీడి నాగార్జున, కానూరి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన.. యాతన

- అప్రోచ్‌లు లేక అవస్థలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- గొల్లవానితిప్పలో మూడు వారాల్లో మూడు ప్రమాదాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్రోచ్‌ల నిర్మాణానికి రూ.36 కోట్ల నిధులు



గొల్లవానితిప్పలో వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



రామాయణపురం వద్ద వంతెనకు అప్రోచ్ లేని దృశ్యం



గొల్లవానితిప్ప వంతెన వద్ద ఇటీవల అప్రోచ్ లేకపోవడంతో బోల్తా పడిన చెరకులోడు వ్యాన్ (ఫైల్)

భీమవరం అర్బన్ : యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్‌లు నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు శాపంగా మారింది. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప–రామాయణపురం, నాగేంద్రపురం –తోకతిప్ప, పట్టణంలో రెస్ట్‌హౌస్ వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలు తుది దశకు చేరుకున్నా అప్రోచ్‌లు నిర్మించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆ వంతెనలకు అప్రోచ్‌లు లేకపోయినా దగ్గర మార్గం కావడంతో ఆటోలు, మహీంద్ర వ్యాన్‌లు, స్కూల్ బస్సులు వాటిపై రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి డెల్టా ఆధునీకరణ పనులు చేసేందుకు రూ.110 కోట్లు నిధులు మంజూరు చేశారు. వాటిలో భాగంగా యనమదుర్రు డ్రెయిన్‌పై పట్టణంలో రెస్ట్‌హౌస్ రోడ్డు వద్ద, యనమదుర్రు, గొల్లవానితిప్ప, నాగేంద్రపురం, నాగిడిపాలెంలో బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గొల్లవానితిప్ప – రామాయణపురం, నాగేంద్రపురం – తోకతిప్ప గ్రామాల మధ్య పట్టణంలో రెస్ట్‌హౌస్ రోడ్డు వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తయ్యి సుమారు ఏడు సంవత్సరాలు గడిచినా కాంట్రాక్టర్లు బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ నిర్మించకపోవడంతో వాహన చోదకులు, గ్రామస్తులు, ప్రయాణికులు, వాహనదారులు, వృద్ధులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ అప్రోచ్ నిర్మిస్తే భీమవరం, మొగల్తూరు, నరసాపురం మండలాలతో పాటు కృష్ణా జిల్లాలో కొన్ని మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాళీపట్నం రోడ్డు నుంచి గొల్లవానితిప్ప బ్రిడ్జి మీదుగా కృష్ణా జిల్లాకు చేరుకోవచ్చని వాహనదారులు చెబుతున్నారు.

మూడు వారాల్లో 3 ప్రమాదాలు

నవంబర్ నెల 15 నుంచి డిసెంబర్ మొదటి వారం వరకు చేపల లోడుతో వెళ్తున్న వ్యాన్, రొయ్యల పరిశ్రమలకు కూలీలతో వెళ్తున్న రెండు ఆటోలు రామాయణపురం వైపు పంట కాలువలోకి బోల్తా కొట్టాయి. స్థానికులు స్పందించడంతో త్రుటిలో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. బ్రిడ్జికి ఇరువైలా అప్రోచ్ లేకపోవడంతో వాహనదారులు ఎత్తు ఎక్కలేకపోతున్నామని ఒక్కోసారి వాహనం అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గమ్యస్థానాలకు దగ్గర మార్గం కావడంతో స్కూల్ బస్సులు, ఆటోలు, చేపల వ్యాన్లు, ట్రాక్టర్లు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల చెరుకు లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. గతంలో నాగేంద్రపురం బ్రిడ్జి వద్ద చేపల సీడ్ పిల్లలు తరలించే ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలో పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అప్రోచ్ నిర్మించి బ్రిడ్జిని ప్రారంభించాలని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు కోరుకుంటున్నారు.

మళ్లీ మొదటికి వచ్చిన సమస్య

సుమారు 7 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు బ్రిడ్జిలు నిర్మాణాలు పూర్తయినప్పటికీ అప్రోచ్‌లు నిర్మించకపోవడతో నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వంలో నిధులు మంజూరై టెండర్ దశకు చేరుకున్నప్పటికీ గత అసెంబ్లీలో ఎమ్మెల్యే అంజిబాబు అప్రోచ్‌ల నిర్మాణానానికి నిధులు మంజూరు చేయాలంటూ ప్రతిపాదించారు. దీంతో సమస్య మళ్లీ వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి

ఇప్పటికే బ్రిడ్జీలు పూర్తయ్యి 7 ఏళ్లు పూర్తి కావస్తున్నాయని అప్రోచ్‌లు నిర్మించకపోవడంతో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తోందని ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో టెండర్ దశకు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ప్రాంత ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.36 కోట్లు అప్రోచ్‌ల నిర్మాణానికి మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ దశకు చేరుకునేటప్పటికీ గొల్లవానితిప్పలో కొంతమంది గ్రామస్తులు పురాతన దేవాలయాలకు నష్టం వాటిల్లుతుందని చెప్పడంతో డిజైన్ మార్పి టెండర్ దశకు పంపించారు. తదనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణికుల నుంచి విమర్శలు వెల్లువెతున్నాయి.

> **ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి**
>
> గొల్లవానితిప్ప బ్రిడ్జి వద్ద ఎక్కువగా ఆటోలు, వ్యాన్లు బోల్తా పడుతున్నాయి. నెలకు రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. త్వరితగతిన అప్రోచ్‌లు నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి
>
> – పెనుమాల నరసింహస్వామి, గొల్లవానితిప్ప

వైఎస్సార్‌సీపీ వీరవాసరం మండల కన్వీనర్‌గా చవ్వాకుల



చవ్వాకుల సత్య నారాయణమూర్తి

వీరవాసరం: వీరవాసరం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా చవ్వాకుల సత్యనారాయణ మూర్తిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తోలేరు గ్రామానికి చెందిన చవ్వాకుల సత్యనారాయణ గతంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, తోలేరు సర్పంచ్‌గా, అండలూరు కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా పనిచేశారు. సత్యనారాయణ మూర్తికి మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోషం వెలిబుచ్చారు. శాసన మండల చైర్మన్ కొయ్యే మోషన్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్‌రాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, డీసీఎం మాజీ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ చినిమిల్లి వెంకటరాయుడు, భీమవరం జెడ్పీటీసీ కాండ్రేకుల నరసింహారావు, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహారాజు, కామన నాగేశ్వరరావు, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు సత్యనారాయణమూర్తిని అభినందించారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన ఏపీ గ్రామ రెవెన్యూ అధికారులు

కాళ్ల: ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సూర్యనారాయణరాజులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా 2025 సంవత్సరం సంఘ క్యాలెండర్ డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, చంద్రమౌళి, రవీంద్రరాజు, మోహనరావు, జక్కరయ్య, అజగర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అత్యాధునిక వైద్యం



మిత్ర మెడికేర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ మోషేన్ రాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

కాళ్ల: అత్యధిక అత్యాధునిక వైద్యం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు తెలిపారు. భీమవరం పరిధిలో కాళ్ల మండలం పెద అమీరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మిత్ర మెడికేర్ మల్టీ స్పెషల్ హాస్పటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన మోషేన్‌రాజు, రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 100 పడకల ఆసుపత్రిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన హాస్పటల్లో వివిధ విభాగాలకు సంబంధించిన కార్యాలయాలను వారు ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భీమవరం పరిసర ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్యం అందుబాటులోకి వచ్చిందని వారు స్పష్టం చేశారు. ప్రముఖ వైద్యులు చుండూరి విక్రాంత్, చుండూరి ప్రియాంక, చుండూరి సాయిబాబు, చుండూరి మల్లేశ్వరి, ప్రముఖులు పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సండే స్కూల్ క్రిస్మస్ వేడుకలు



సండే స్కూల్ క్రిస్మస్‌లో ప్రసంగిస్తున్న రాజేష్ పాల్, సత్యవతి

పాలకోడేరు: మండలంలోని మోగల్లు గ్రామంలో జీడీఎం చర్చ్ సండే స్కూల్ పిల్లలకు క్రిస్మస్ వేడుకలు దైవజనుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్యంగా సండే స్కూల్ విద్యార్థులు జీసెస్ పాటలతో, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా పాస్టర్లు వై జార్జి ముల్లర్, గోపే సాల్మన్ రాజు, లిడియా సిస్టర్స్, రాజేష్ పాల్‌లు మాట్లాడుతూ మన అందరి కోసం, శాంతి కోసం జీసెస్ యేసుక్రీస్తు తన ప్రాణాన్ని అర్పించారన్నారు. ప్రతి ఒక్కరు క్షమా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ గోపే, సాల్మన్ రాజు సండే స్కూల్ టీచర్ వై. రాజి, లిడియా సిస్టర్స్,ఆసాపు రాజు, చంద్రబాబు, కాలేబు, ఎలీషా, పాలకోడేరు, గొల్లలకోడేరు, భీమవరం, వేంద్ర, కోరుకొల్లు, మైప తదితర గ్రామాల సండే స్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూః వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం పవిత్ర సప్తమి పర్వదినం పురస్కరించుకుని స్వామివారికి లక్ష తులసి పూజ, అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన, స్వామి అమ్మవార్లకు సుగంధ పరిమళ పుష్పములతో అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ, నీరాజన మంత్రపుష్పములు, దేవస్థానం ఆస్థాన వేద పండితులు అనిపెద్ది ఫణి కుమార్ శర్మ, అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అనంతరం అఖండ అన్న సమారాధన జరిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సందడిగా బాలోత్సవం





బాలోత్సవంలో వివిధ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మారుతి నగర్ పార్కులో ఆదివారం బాలోత్సవాన్ని బాల బాలికలతో సందడి వాతావరణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డీఈఓ ఇందుకూరు ప్రసాద్‌రాజు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ బాలోత్సవంలో పిల్లలకు చిత్రలేఖనం, లెమన్ స్పూన్, స్టోన్ గేమ్, శాక్ రేస్ వంటి క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడలకు సుమారు 100 మంది బాల బాలికలు హాజరయ్యారు. బాల బాలికలంతా ఈ క్రీడల్లో చురుగ్గా పాల్గొని వారి ప్రతిభను చాటుకున్నారు. క్రీడల అనంతరం ఏర్పాటుచేసిన బహుమతి ప్రదానోత్సవ సభకు మారుతి నగర్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పావిరాల రామ్మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సభ ఆధ్వర్యంలో గెలుపొందిన బాలబాలికలకు స్థానిక పెద్దలు కామన నాగేశ్వరరావు, పంపన శ్రీనివాసు, వలవల నరసింహారావు, చేకూరి నరసింహారాజు, గాదిరాజు కృష్ణంరాజు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు చైతన్య ప్రసాద్, శిరీష జ్యోతి, జి రాధ జి.ధనుష్, కే ప్రమోద్, సూర్య, బి గణేష్, బి విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలి



భీమవరంలో మాట్లాడుతున్న సీపీఐ పార్టీ మండల కార్యదర్శి సీతారామ్ ప్రసాద్

భీమవరం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో తాత్సారం చేస్తోందని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి ఎమ్ సీతారామ్ ప్రసాద్ విమర్శించారు. భీమవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ మండల కార్యదర్శి సీతారామ్ ప్రసాద్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వడంలో పాలకులు రోజుకో మాట చెబుతూ జాప్యం చేయడం సరికాదని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఆశలు సన్నగిల్లుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, కేవీ అనుగ్రహం తదితరులు ఉన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పోతుల విఘ్నేశ్వరరావు (పీవీ రావు) 19వ వర్ధంతిని పీవీరావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాలకొల్లు పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానుకొండ శ్రీనుబాబు, కొప్రపాటి వీరాస్వామి, ఇంజేటి కుమారస్వామి, దేవ రాజేష్, పితాని పుష్పరాజ్, ఉప్పె పండుబాబు, బొంద పండు, వర్ధనపు పెదకాసు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యం

తణుకు అర్బన్ : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటికీ వైద్యంలో భాగంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వైద్యసేవలందించారు. తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో 5గురి వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఉచిత వైద్యం అందజేశారు. ఆడిటర్ జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 90592 90717, 99853 43530 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజగోపాల్ సేవలు ఎనలేనివి

తణుకు అర్బన్: ఇటీవల మృతిచెందిన ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్ సంస్మరణ సభ ఆదివారం తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తిలో ఆయన సేవలు అభినందనీయమని, పదవీ విరమణ అనంతరం కూడా ఉపాధ్యాయ సమస్యలపై నిత్యపోరాటాలు చేశారని వక్తలు కొనియాడారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ మంజుల, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, పూర్వ అధ్యక్షులు పీఎస్వీ ప్రసాద్, ఎస్కే జిలాని, ఇరగవరం ఎంఈవో ఎస్.శ్రీనివాస్, కొండే నాగేశ్వరరావు, ఎస్వీ జాకబ్‌బాబు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్నె నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కాళ్ల: వైఎస్సార్ సీపీ అంటేనే బీసీల పార్టీ అని, పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్నె నాగరాజు స్పష్టం చేశారు. బొండాడ గ్రామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తానన్నారు. నియోజవర్గ ఇంచార్జ్ పీవీఎల్ నరసింహరాజు ఆశీర్వాదాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలంతా ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని చెప్పారు. బీసీలను ఓటు బ్యాంకుగా కాకుండా బీసీలకు ఉన్నత పదవులు ఇచ్చి ఎంతో గౌరవించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని చెప్పారు. మందపాటి రవి, నాయకులు పాల్గొన్నారు.

అబాకస్ ఇంటర్నేషనల్‌లో భీమవరం విద్యార్థుల ప్రతిభ



అబాకస్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): అబాకస్ ఇంటర్నేషనల్ – 24 ప్రపంచస్థాయి పోటీల్లో భీమవరం యూసీ మాస్ సెంటర్ విద్యార్థులు తృతీయస్థానం సాధించడం భీమవరం పట్టణానికే గర్వకారణమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఈనెల 14 ,15 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రపంచస్థాయి అబాకస్ 2024 పోటీల్లో భీమవరం యూసీ మాస్ సెంటర్ విద్యార్థి రామిశెట్టి జగదీష్ మూడో స్థానం సాధించారని అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు. 86 దేశాలకు చెందిన విద్యార్థులు ఈ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనగా, ఫైనల్స్‌లో 30 దేశాల విద్యార్థులతో పోటీపడి మూడోస్థానం భీమవరం ఏసీ మాస్ సెంటర్ విద్యార్థి జగదీష్ సాధించడం గొప్ప విశేషమని, వీరికి శిక్షణ ఇచ్చిన ఆకుల మౌనికను ఎమ్మెల్యే అంజిబాబు ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వేణ్య అక్షిత సంకురు కూడా మెరిట్ అవార్డు సాధించిందని, పోటీల్లో పాల్గొన్న 10 మంది విద్యార్థులను ఎమ్మెల్యే అంజిబాబు మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, సూర్యమిత్ర ఎగ్జిమ్స్ అధినేత ఈ. సూర్యారావు, పాత్తూరి బాపిరాజు, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

భద్రత కోసమే హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధరించాలంటూ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వాహనదారుల భద్రత కోసమే హెల్మెట్ ధరించాలని భీమవరం ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి అన్నారు. మీ కోసం, మీ భద్రత కోసం హెల్మెట్ ధరించాలని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ నారాయణమూర్తి మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని తద్వారా ప్రమాదాల కొని తెచ్చుకుని వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఇబ్బందులు తెచ్చుకోవద్దని సీఐ సూచించారు. ఎస్సై ఘాఫురీన్ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో సంవత్సరానికి వందల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ వాహనదారులకు రక్షణ కవచంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాగిత సురేంద్ర, దాలయ్య, కారుమూరి సత్యనారాయణ మూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచం మెచ్చిన గొప్ప గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ ఒకరని అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హాస్టల్ వార్డెన్ శ్యామల మాట్లాడుతూ గణిత శాస్త్రానికి దిశానిర్దేశం చేసిన శాస్త్రవేత్తలు మన దేశంలో చాలా మంది ఉన్నారని అన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.